**సంగారెడ్డి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓటర్లు**


| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| నారాయణఖేడ్ | 116581 | 114599 | 8 | 231188 |
| అందోల్ | 122699 | 126543 | 6 | 249248 |
| జహీరాబాద్ | 136523 | 134259 | 3 | 270785 |
| సంగారెడ్డి | 121636 | 123582 | 35 | 245253 |
| పటాన్‌చెరు | 205045 | 192116 | 76 | 397237 |
| మొత్తం | 702484 | 691099 | 128 | 1393711 |

**సర్వీసు ఓటర్లు**

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|
| నారాయణఖేడ్ | 66 | 1 | 67 |
| అందోల్ | 48 | 0 | 48 |
| జహీరాబాద్ | 103 | 0 | 103 |
| సంగారెడ్డి | 63 | 3 | 66 |
| పటాన్‌చెరు | 65 | 5 | 70 |

**ఎన్ఆర్ఐ ఓటర్లు**

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|
| నారాయణఖేడ్ | – | – | – |
| అందోల్ | 5 | – | 5 |
| జహీరాబాద్ | 3 | – | 3 |
| సంగారెడ్డి | 10 | – | 10 |
| పటాన్‌చెరు | 42 | 14 | 56 |



# 13,93,711

**7,02,484 మంది పురుషులు.., 6,91,099 మంది మహిళా ఓటర్లు**

**ఇది సంగారెడ్డి జిల్లాలోని మొత్తం ఓటర్ల సంఖ్య**

**ఓటర్ల తుది జాబితా వెల్లడించిన అధికారులు**

సంగారెడ్డి, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో తుది ఓటరు జాబితాను అధికారులు ప్రచురించారు. అధికారుల సమాచారం మేరకు సంగారెడ్డి జిల్లాలో ఓటర్ల 13,93,711కు చేరుకున్నది. ఇటీవల యువ ఓటర్ల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఓటర్ల సంఖ్య పెరిగింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు ప్రకటించిన ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య 13,55,958 ఉండగా, తుది ఓటరు జాబితా ప్రచురణలో ఓటర్ల సంఖ్య 13,93,711కు పెరిగింది. ఎన్నికల కమిషన్ ఆన్‌లైన్‌లో సైతం అర్హులైన ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. 18 ఏండ్ల వయస్సు దాటిన యువకులు ఇతరులు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. 37,753 మంది కొత్తగా ఓటరు జాబితాలో చేరారు. దీంతో ఓటర్ల సంఖ్య 13,93,711కు పెరిగింది. జిల్లాలో 7,02,484 పురుష ఓటర్లు ఉండగా, 6,91,099 మహిళా ఓటర్లు, 128 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 2,31,188 మంది ఓటర్లు, అందోల్‌లో 2,49,248, జహీరాబాద్‌లో 2,70,785 మంది ఓటర్లు ఉన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 2,45,253, పటాన్‌చెరు నియోజకవర్గంలో 3,97,237 మంది ఓటర్లు ఉన్నారు.

# పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయండి

- సీ విజిల్ ఫిర్యాదులు 100 నిమిషాల్లో పరిష్కరించాలి
- పోలింగ్ సిబ్బంది నుంచి పోస్టల్ బ్యాలెట్ స్వీకరించాలి
- ఆవిష్కరించిన సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 13: ఎన్నికల నిర్వహణలో కీలకమైన పోలింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు, నోడల్ అధికారులు తదితరులతో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధుల్లో ఉండే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చి స్వీకరించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ స్వీకరణ రేపటిలోగా పూర్తి కావాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా సహకరించాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, తాగునీరు, రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్ల సౌకర్యం, దివ్యాంగులకు ర్యాంపు తదితర ఏర్పాట్లన్నీ సజావుగా ఉండేలా మరోమారు పరిశీలించాలని సూచించారు. ఫారం–12డీ ద్వారా 80 ఏండ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు, అత్యవసర సేవల విభాగపు సిబ్బందికి ఓటు వేసే అవకాశం కల్పించాలన్నారు. నియోజకవర్గం వారీగా ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సీ విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులు 100 నిమిషాల్లో పరిష్కరించాలని, లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగదు, లిక్కర్, గిఫ్టులు, చీరలు, కుక్కర్లు తదితర వస్తు సామగ్రి పంపిణీలపై ప్రత్యేక దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి గ్రామం, ప్రతి జంక్షన్, ప్రతి వార్డులో సీ విజిల్‌కు సంబంధించిన పోస్టర్ ఉండాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి ఉల్లంఘనలు ఎక్కడ జరగకుండా చూసుకోవాలన్నారు.

**శిక్షణకు సిద్ధం కావాలి..**

పీవో, ఏపీవో, ఓపీవోల శిక్షణకు సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. వెబ్ కాస్టింగ్, కౌంటింగ్ సెంటర్ ఫైనలైజేషన్ తదితర ప్రతిపాదనలు అందజేయాలని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వివరాలు ఇవ్వాలని తెలిపారు. ఓటర్ సమాచార స్లిప్పుల పంపిణీ బాధ్యత సెక్టోరల్ అధికారులు, ఏఆర్వోలదేనని స్పష్టం చేశారు. పోలింగ్ తేదీ స్టిక్కర్లు ప్రతి ఇంటికి అంటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్, స్వీప్ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ తర్వాత చేయాల్సిన పనులకు సంబంధించి ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా అన్ని పనులు సవ్యంగా పూర్తి చేయాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో నగేశ్, ఆర్డీవోలు, విద్యుత్‌శాఖ ఎస్ఈలు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు, మున్సిపల్ అధికారులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



జేఎన్టీయూలో స్ట్రాంగ్ రూం గదులను పరిశీలిస్తున్న అందోలు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు దీపక్ సిగ్ల

## జేఎన్టీయూలో స్ట్రాంగ్‌రూం పరిశీలన

**ఏర్పాట్లు పర్యవేక్షించిన అందోల్ అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు దీపక్ సిగ్ల**

చౌటకూర్, నవంబర్ 13: మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను అందోల్ అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి దీపక్ సిగ్ల సోమవారం పరిశీలించారు. అందోలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ కళాశాలల్లోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చారు. ఇందులో భాగంగానే అందోల్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాండు, ఇతర రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన జేఎన్టీయూలో స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద పారమిలటరీ బలగాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి. స్ట్రాంగ్ రూంల్లో ఈవీఎంల భద్రత అందుకు సంబంధించి తీసుకున్న చర్యల గురించి రిటర్నింగ్ అధికారి పాండును అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 30న జరుగనున్న పోలింగ్‌కు ఇక్కడి నుంచే ఈవీఎంలను వాహనాల్లో తరలించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి కళాశాలలో సిబ్బందికి ఈవీఎంలు అందజేసేందుకు అవసరమైన వేదిక, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు యాదగిరి, నాగరాజు తదితరులున్నారు.

# దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు


- 13 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్





జహీరాబాద్‌లో వివరాలు వెల్లడిస్తున్న సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్

జహీరాబాద్, నవంబర్ 13: జహీరాబాద్ పట్టణంలో జరిగిన చోరీ కేసును పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. ఈమేరకు ఆదివారం సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ జహీరాబాద్ సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్, అతడి భార్య ఇద్దరు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఈ నెల 9న ఉదయం ఇంటికి తాళం వేసి ఇద్దరూ పాఠశాలకు వెళ్లి, మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉందని, లోపలికి వెళ్లి చూడగా అల్మారా తలుపులు తెరిచి ఉండి, అందులో బంగారం దొంగిలించినట్లు గుర్తించిన మహ్మద్ ఇమ్రాన్, అదే రోజు సాయంత్రం జహీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న జహీరాబాద్ పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ విచారణ ప్రారంభించి, పట్టణ సీఐ రాజు పర్యవేక్షణలో విచారణ చేపట్టారు. దొంగతనం చోటును పరిశీలించి పూర్తి సాక్షాధారాలు సేకరించి, చుట్టు పక్కన ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారన్నారు. సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజీని పరిశీలించి, ఆదివారం ఉదయం 4 గంటలకు మాఫిల్ హోటల్ వద్ద నేరస్తుడిని గుర్తించి, పట్టుకున్నారని తెలిపారు. దొంగతనం చేసిన 13 తులాల బంగారు ఆభరణాలైన గోల్డ్ నెక్లెస్ 2 తులాలు, హారం 5 తులాలు, మంగళ సూత్రం 4 తులాలు, 6 గోల్డ్ రింగ్స్ 2 తులాలను స్వాధీనం చేసుకుని, ఓ మైనర్‌ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. దొంగతనానికి ప్రోత్సహించిన పెద్దమ్మ, రేఖ, ప్రేమ్ పరారీలో ఉన్నారని, వీరు బాధితుల ఇంటి పక్కనే ఉంటారని తెలిపారు. రెండు రోజుల వ్యవధిలో కేసును ఛేదించి దొంగలించిన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్న జహీరాబాద్ పట్టణ పోలీసులను అభినందించి, రివార్డులు ప్రకటించారు. సమావేశంలో డీఎస్పీ వి.రఘు, జహీరాబాద్ పట్టణ సీఐ రాజు, ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ రహ్మాన్, క్రైమ్ సిబ్బంది జైపాల్ రెడ్డి, అస్లాం తదితరులున్నారు.





స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

**అన్నారం గ్రామ పంచాయతీ కార్యదర్శిపై**

# సస్పెన్షన్ వేటు

గుమ్మడిదల, నవంబర్ 13: అన్నారం గ్రామ పంచాయతీ పరిధిలో నిషేధిత ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తులకు ఇంటి నంబర్లు కేటాయించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి జె.ఎం.సుదర్శన్‌ను సస్పెండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టర్ శరత్ ఉత్తర్వులు జారీ చేశారు. గుమ్మడిదల మండలం అన్నారం గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ నిషేధిత భూమిలో (6) మంది ప్రైవేట్ వ్యక్తులకు పంచాయతీ కార్యదర్శి ఇంటి నెంబర్లు కేటాయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయ్యిందని అధికారులు తెలిపారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శి రక్త సంబంధీకులకు, ఒక వార్డు సభ్యు డి బంధువులకు ఇంటి నంబర్లు కేటాయించినట్లు గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ ఫిర్యాదు చేశాడు. ఈ మే రకు గుమ్మడిదల మండల పంచాయతీ అధికారిని పూర్తిస్థాయిలో ప్రాథమిక విచారణ చేసి నివేదికను సమర్పించాలని డీపీవోను ఆదేశిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.